
అసెంబ్లీలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

యూజీసీ నిబంధనలపై స్టాలిన్ ఆగ్రహం

- వీసీల ఎంపిక సెర్చ్‌కమిటీ బాధ్యత గవర్నర్‌కా?
- ఈ విధానం విద్యారంగాన్ని నాశనం చేసే ప్రయత్నమే
- అసెంబ్లీలో వ్యతిరేక తీర్మానం ఆమోదం

చెన్నై, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్యారంగాన్ని నాశనం చేసే ప్రయత్నంలో భాగంగానే యూనివర్సిటీ వీసీల ఎంపిక కోసం సెర్చ్ కమిటీ నియామక బాధ్యత గవర్నర్‌కు కట్టబెట్టడమని ముఖ్యమంత్రి స్టాలిన్ ధ్వజమెత్తారు. అందరికీ నాణ్యమైన విద్య అందించాలని తపిస్తూ డీఎంకే చేస్తున్న ద్రావిడ తరహా పాలన ప్రయత్నాలకు అడ్డుపుల్ల వేయటమే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, నీట్‌తో డాక్టర్లు కావాలనుకున్న గ్రామీణ నిరుపేద విద్యార్థుల ఆశలను వమ్ము చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే తరహాలో విశ్వవిద్యాలయాలపై గవర్నర్ పెత్తనం చెలాయించేలా యూజీసీ ద్వారా కొత్త నిబంధన అమలు చేయడానికి ప్రయత్నించడం గర్హనీయమన్నారు. శాసనసభలో గురువారం వీసీల ఎంపిక కోసం సెర్చ్‌కమిటీలను ఏర్పాటు చేసే బాధ్యత పూర్తిగా గవర్నర్‌కు అప్పగిస్తూ యూజీసీ ప్రవేశపెట్టిన కొత్త నిబంధనకు వ్యతిరేకంగా ఓ ప్రత్యేక తీర్మానాన్ని ఆయన ప్రతిపాదించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వీసీల ఎంపిక కోసం ముగ్గురు సభ్యులతో సెర్చ్‌కమిటీ ఏర్పాటు చేసి గవర్నర్‌కు పంపగా, ఆ కమిటీలో యూజీసీ ప్రతినిధి కూడా ఉండాలని పట్టు బట్టారని, తమ ప్రభుత్వం ఆ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించిందని గుర్తు చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి గవర్నర్‌కు మధ్య అభిప్రాయ భేదాలు నెలకొన్నాయన్నారు. ఈ పరిస్థితుల్లోనే యూజీసీ వీసీల సెర్చ్ కమిటీ ఏర్పాటు చేసుకునే బాధ్యతను పూర్తిగా గవర్నర్‌కే అప్పజెప్పేలా కొత్త నిబంధన ప్రవేశపెట్టిందన్నారు. ఈ నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన విశ్వవిద్యాలయాల అజామాయిషీ పూర్తిగా కేంద్రప్రభుత్వం చేతుల్లోకి వెళ్లిపోతుందన్నారు. అంతేకాకుండా వాళ్లంతట వారే విశ్వవిద్యాలయాలపై ఉత్తర్వులు జారీచేసి, వాటిని అమలు చేయనివాటికి నిధులు నిలిపివేసే ఆస్కారం కూడా ఉంటుందన్నారు. అంతేకాకుండా విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేయడానికి వీల్లేదంటూ యూజీసీ నిర్వాహకులు బెదిరింపులకు పాల్పడే అవకాశం కూడా ఉందన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల చేతుల్లోనే విద్యారంగం ఉండాలని, అప్పుడే అన్ని వర్గాలవారికి నాణ్యమైన విద్య అందగలదన్నారు. దేశంలోనే నాణ్యమైన విద్యాసంస్థలున్న రాష్ట్రంగా పేరున్న తమిళనాట విద్యా సంస్థలన్నింటిపైనా తిరుగులేని అధికారం చెలాయించేందుకు యూజీసీ, దానిని తెరవెనుక నడుపుతున్న బీజేపీ ప్రభుత్వం ఇలా దొడ్డిదారి ప్రయత్నాలు సాగిస్తోందని విరుచుకుపడ్డారు. యూజీసీ ప్రతిపాదించిన ఈ కొత్త నిబంధనకు వ్యతిరేకంగా తాను ప్రతిపాదించిన తీర్మానాన్ని సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించాలని కోరారు. శాసనసభలో చేసిన ఈ తీర్మానాన్ని యూజీసీ, కేంద్రప్రభుత్వం పట్టించుకోకపోతే చట్టపరమైన చర్యలకు తమ ప్రభుత్వం న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తుందని స్టాలిన్ హెచ్చరించారు. అనంతరం ఆ తీర్మానం మెజారిటీ సభ్యుల ఆమోదంతో నెరవేరిందని స్పీకర్ అప్పావు ప్రకటించారు.


తంజావూరులో యూజీసీకి వ్యతిరేకంగా ధర్నా చేస్తున్న విద్యార్థులు

తంజావూరులో విద్యార్థుల ధర్నా...

వీసీల సెర్చ్‌కమిటీని రూపొందించే బాధ్యతలను గవర్నర్‌కు అప్పగిస్తూ యూజీసీ చేసిన కొత్త నిబంధనకు వ్యతిరేకంగా తంజావూరులోని ప్రభుత్వ సర్ఫోజీ కళాశాల విద్యార్థులు గురువారం తరగతులు బహిష్కరించి ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాకు ఆ సంఘం అధ్యక్షుడు రంజిత్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా యూజీసీ కొత్త నిబంధన ప్రకటన ప్రతులను విద్యార్థులు దగ్ధం చేశారు.


మార్కెట్‌లో రద్దీ

కోయంబేడులో ప్రారంభమైన పొంగల్ సంత

- చెరకు గడ కట్ట రూ.600


మార్కెట్‌కు దిగుమతైన చెరకు గడలు

ప్యారీస్,జనవరి9(ఆంధ్రజ్యోతి): పొంగల్ సంప్రదాయ పండుగ సందర్భంగా స్థానిక కోయంబేడు హోల్‌సేల్ మార్కెట్లో గురువారం ప్రత్యేక సంత ప్రారంభమైంది. ఈ సంతలో పూజాసామగ్రి, చెరకు గడలు, పసుపు కొమ్ములు, అల్లం తదితరాలు విక్రయానికి అందుబాటులో ఉన్నాయి. విల్లుపురం, మదురై, తంజావూరు, నాగపట్టణం తదితర జిల్లాల నుంచి లారీల్లో ఇక్కడికి చెరకు గడలు, ఇతర పూజా సామగ్రి తరలించారు. 20 చెరకు గడలు కలిగిన కట్ట రూ.600, అల్లం రూ.200, పసుపు కొమ్ములు రూ.150కి విక్రయిస్తున్నారు. ఈ నెల 16వ తేది వరకు 8 రోజులు కొనసాగనున్న ఈ ప్రత్యేక సంతలో వ్యాపారుల సౌకర్యార్థం తాగునీరు, మరుగుదొడ్లు తదితర వసతులు కల్పించారు. వచ్చే ఆదివారం నుంచి పుదుచ్చేరి, సేలం, ధర్మపురి తదితర జిల్లాల నుంచి లారీల ద్వారా చెరకు గడలు రానున్నాయి. ఈ సంతకు వస్తున్న కొనుగోలుదారుల వాహనాల వల్ల ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా 300 మందికి పైగా పోలీసులు భద్రతా విధులు నిర్వహిస్తున్నారు.

16న హోల్‌సేల్ మార్కెట్‌కు సెలవు...

పొంగల్ పండుగలో భాగమైన కానుం పొంగల్ రోజైన ఈ నెల 16న కోయంబేడు హోల్‌సేల్ మార్కెట్‌కు సెలవు ప్రకటించారు. ఈ మేరకు వ్యాపారుల సంఘ అధ్యక్షుడు ఎస్ఎస్ ముత్తుకుమార్ మీడియాతో మాట్లాడుతూ... భోగి, పొంగల్ పండుగలకు అవసరమైన పూజా సామగ్రి తదితరాలను సరసమైన ధరలకు విక్రయించేలా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కానుం పొంగల్ సందర్భంగా కూరగాయలు, పండ్ల దుకాణాలు మూసివేయనున్నట్లు ఆయన తెలిపారు.


బస్సును ఢీకొన్న లారీ

రోడ్డు ప్రమాదంలో నలుగురి మృతి

పెరంబూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మేల్‌మరువత్తూర్ నుంచి వస్తున్న కర్ణాటకకు చెందిన భక్తుల బస్సు, లారీ రాణీపేట వద్ద ఢీకొన్న ఘటనలో నలుగురు మృతిచెందగా, మరో 35 మందికి గాయాలయ్యాయి. వివరాలిలా వున్నాయి... కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా మున్‌బాగల్ ప్రాంతానికి చెందిన భక్తులు మేల్‌మరువత్తూర్ ఆదిపరాశక్తి ఆలయ మాలధారణ చేసి, నాలుగు బస్సుల్లో ఆలయానికి వచ్చి స్వామి దర్శనం చేసుకొని బుధవారం రాత్రి తిరుగుప్రయాణమయ్యారు. అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో చెన్నై-చిత్తూరు జాతీయ రహదారిలోని రాణిపేట జిల్లా సిప్కాట్ ప్రాంతంలో భక్తులతో వస్తున్న బస్సు, మట్టి లోడుతో వస్తున్న లారీని ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించగా, ఆంధ్ర నుంచి కూరగాయల లోడుతో ఎదురుగా వచ్చిన వ్యాన్ బస్సును ఢీకొంది. అదే సమయంలో మట్టి లారీ కూడా బస్సును వెనుక నుంచి ఢీకొంది. దీంతో మూడు వాహనాలు రోడ్డు పక్కన పల్లపు ప్రాంతంలోకి వెళ్లాయి.. ఈ ఘటనలో వ్యాన్ డ్రైవర్ మంజునాథ్ (30), క్లీనర్ శంకర్ (32), కృష్ణప్ప (65), సోమశేఖర్ (30) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. బస్సులో ప్రయాణిస్తూ గాయపడిన 35 మందిని వాలాజా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని రాణిపేట జిల్లా ఎస్పీ వివేకానంద శుక్లా పరిశీలించారు. ఈ ఘటనపై సిప్కాట్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటన కారణంగా ఆ మార్గంలో సుమారు 2 గంటలపాటు వాహనాల రాకపోకలు స్తంభించాయి.

పొంగల్ సరకుల పంపిణీ ప్రారంభం


రేషన్‌షాపులో సరకులను పంపిణీ చేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా 2.20 కోట్ల మందికిపైగా రేషన్‌కార్డుదారులకు, శిబిరాల్లో ఉంటున్న శ్రీలంక తమిళుల కుటుంబాలకు రేషన్‌షాపుల ద్వారా పొంగల్ సరకుల పంపిణీని ముఖ్యమంత్రి స్టాలిన్ గురువారం ఉదయం శ్రీకారంచుట్టారు. అర్హులైన బియ్యం కార్డుదారులకు సంక్రాంతి సందర్భంగా కేజీ పచ్చి బియ్యం, కేజీ చక్కెర, ఓ చెరకు గడ కానుకగా ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అదే విధంగా సంక్రాంతిని పురస్కరించుకుని ఈ కార్డుదారులకు ఉచిత చీర, ధోవతిని కూడా పంపిణీ చేయనున్నట్లు ప్రకటించింది. ఆ ప్రకారం గురువారం ఉదయం ట్రిప్లికేన్ నగర సహకార సంఘం ద్వారా సైదాపేట లిటిల్ మౌంట్‌లోని రేషన్‌షాపులో బియ్యం కార్డుదారులకు ఈ ఉచిత సంక్రాంతి సరకుల పంపిణీని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. ఇదే విధంగా 1.77కోట్ల మందికిపైగా బియ్యం కార్డుదారులకు ఉచిత చీర, ధోవతి పంపిణీ కార్యక్రమాలను కూడా ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కేఆర్ పెరియకరుప్పన్, ఆర్ చక్రపాణి, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్ ప్రియ, ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్, డిప్యూటీ మేయర్ ఎం.మహేష్‌కుమార్, ఆహార వినియోగదారుల భద్రతా శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.రాధాకృష్ణన్, రెవెన్యూ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి పి.అముద, చేనేత సహకార శాఖ కార్యదర్శి వి.అముదవల్లి, సహకార సంఘాల రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్.సుబ్బయ్యన్, చెన్నై జిల్లా కలెక్టర్ రష్మీ సిద్దార్థ్ జక్డే తదితరులు పాల్గొన్నారు.


రవాణా శాఖలో కారుణ్య ప్రాతిపదికన నలుగురికి ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేస్తున్న మంత్రి శివశంకర్

సొంతూళ్లకు వెళ్లేందుకు 1.32 లక్షమంది రిజర్వేషన్

- నేటినుండి ప్రత్యేక బస్సులు

చెన్నై, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను సొంతూళ్లకు వెళ్ళి జరుపుకునేందుకు సుమారు 1.32 లక్షలమంది రాష్ట్రరవాణా సంస్థ ప్రత్యేక బస్సుల్లో టికెట్లు రిజర్వుచేసుకున్నారు. ఈ ప్రత్యేక బస్సులు శుక్రవారం నుంచి ప్రారంభమవుతాయని రవాణా శాఖ మంత్రి శివశంకర్ తెలిపారు. సొంతూళ్లకు వెళ్లేవారికోసమే రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 17వ తేదీ సెలవుగా ప్రకటించింది. దీంతో వీరంతా ఆరు రోజుల పాటు స్వస్థలల్లో సంక్రాంతి వేడుకలను జరుపుకుని తిరిగి రానున్నారు. చెన్నై నుండి మొత్తం 14 వేల బస్సులు నడపనున్నారు. కోయంబేడు, మాధవరం, కిలాంబాక్కం బస్‌స్టేషన్ల నుంచి ఈ ప్రత్యేక బస్సులు బయలుదేరనున్నాయి. గురువారం రాష్ట్ర రవాణా సంస్థ వెల్లడించిన వివరాల మేరకు 1.30 లక్షల మంది టికెట్లు రిజర్వేషన్ చేసుకున్నారు. గత యేడాది కంటే ఈ యేడాది అత్యధిక సంఖ్యలో ప్రయాణికులు స్వంత వూర్లకు వెళ్లనున్నారని అధికారులు చెప్పారు.


ట్రిప్లికేన్ శ్రీపార్థసారథి ఆలయ స్వర్గద్వారాన్ని శుభ్రం చేస్తున్న సిబ్బంది

నేడు ముక్కోటి ఏకాదశి

వైష్ణవ క్షేత్రాల్లో వైకుంఠ ద్వార దర్శనం ● పోటెత్తిన భక్తులు

ప్యారీస్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశికోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వైష్ణవాలయాలన్నీ ముస్తాబయ్యాయి. గురువారం నుంచే ఉపవాసాలు చేసిన భక్తులు అర్ధరాత్రి నుంచే వైకుంఠ ద్వారం దర్శనం కోసం వైష్ణవ ఆలయాల వద్ద బారులుతీరారు. భూలోక వైకుంఠంగా ప్రసిద్ధిచెందిన తిరుచ్చి జిల్లా శ్రీరంగంలోని రంగనాథ స్వామి ఆలయం, ట్రిప్లికేన్‌లోని పార్థసారధి ఆలయం, టి.నగర్ లోని టీటీడీ సమాచార కేంద్రంలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయం, పార్క్ టౌన్‌లోని రంగనాథస్వామి ఆలయాలు సహా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పెరుమాళ్ ఆలయాలకు భక్తులు పెద్దసంఖ్యలో పోటెత్తారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం తెల్లవారుజామున 2 గంటలకు తిరుప్పావై, ధనుర్మాస కైంకర్యాలు పూర్తయిన తర్వాత వేకువజాము 4.30 గంటల నుంచి వైకుంఠ ద్వార దర్శనాలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో, వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయాల వద్ద భద్రతా ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ముందే టోకెన్లు పొందిన భక్తులను పోలీసులు క్యూలైన్లలోకి అనుమతించారు. ఇదిలా వుండగా వెంకటనారాయణరోడ్డులో వున్న శ్రీవారి ఆలయంలో శుక్రవారం వేకువజామున 3.30 నుంచి ఉదయం 11 గంటల వరకు, తిరిగి 11.45 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు స్వామివారి దర్శనం వుంటుందని నిర్వాహకులు ప్రకటించారు.



టి.నగర్ టీటీడీ ఆలయం వద్ద వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు, నిర్వాహకులు - వైకుంఠ ఏకాదశి సందర్భంగా విద్యుత్ దీపాల వెలుగులో మిరిమిట్లు గొల్పుతున్న టీటీడీ ఆలయ ప్రాంగణం

ఈపీఎస్ ఎంపికపై ఈసీ విచారణకు బ్రేక్



- స్టే విధించిన హైకోర్టు



చెన్నై, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ఎంపికకు అనుమతివ్వ కూడదంటూ దాఖలైన పిటిషన్‌పై కేంద్ర ఎన్నికల సంఘం జరుపుతున్న తాజా విచారణను నిలుపుదల చేస్తూ మద్రాసు హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అన్నాడీఎంకే అంతర్గత వ్యవహారాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసుల ఫలితం వచ్చేంతవరకు ఆ పార్టీకి రెండాకుల గుర్తు కేటాయించకూడదని, ఈ విషయమై 2017 నుంచి 2022 వరకు తాను పంపిన పిటిషన్లపై కేంద్ర ఎన్నికల సంఘం విచారణ జరిపేలా ఉత్తర్వులివ్వాలని కోరుతూ నగరానికి చెందిన సూర్యమూర్తి అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసు విచారణ సమయంలో పిటిషనర్ కోరికను నాలుగు వారాల్లోగా పరిశీలించి నిర్ణయం ప్రకటించాలని హైకోర్టు ఆదేశించింది. కేంద్ర ఎన్నికల సంఘం హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం విచారణ జరుపుతామని భరోసా ఇచ్చింది. దీంతో హైకోర్టు ఈ కేసుకు ముక్తాయింపు పలికింది. ఈ పరిస్థితుల్లో అన్నాడీఎంకే సర్వసభ్య మండలి సమావేశంలో మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ప్రధానకార్యదర్శిగా ఎంపికైనట్లు గుర్తించకూడదంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి ఉత్తర్వులివ్వాలని మాజీ ఎంపీ పి.రవీంద్రనాథ్, కేసీ పళనిస్వామి హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ ఆధారంగా కేంద్ర ఎన్నికల సంఘం విచారణ జరుపుతోంది. ఈ విచారణపై స్టే విధించాలని కోరుతూ అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) తరఫున మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తులు ఆర్.సుబ్రమణియన్, సి.కుమరప్పన్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపారు. ఈపీఎస్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది సుందరం పార్టీలో సభ్యులుకాని వ్యక్తులు అన్నాడీంకే సర్వసభ్య మండలి తీర్మానాలను వ్యతిరేకిస్తూ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేశారని, ఆ ఫిర్యాదులపై విచారణ జరిపేందుకు కేంద్ర ఎన్నికల సంఘానికి అధికారం లేదని వాదించారు. ఆ వాదనతో ఏకీభవించిన ధర్మాసనం పార్టీ అంతర్గత వ్యవహారాలకు సంబంధించి చట్టపరమైన కేసులు పెండింగ్‌లో ఉండగా అదే వ్యవహారంపై కేంద్ర ఎన్నికల సంఘం విచారణ జరిపేందుకు ఆస్కారం లేదని, మాజీ ఎంపీ రవీంద్రనాథ్ ఫిర్యాదులపై ఆ సంఘం జరుపుతున్న విచారణను నిలిపివేయాలని స్పష్టం చేసింది. అంతేకాకుండా ఈపీఎస్ తరఫు తాజాగా దాఖలు చేసిన పిటిషన్‌కు ఈ నెల 27 లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఎన్నికల సంఘాన్ని ధర్మాసనం ఆదేశించింది.

సమాచార ధ్వని

శ్రీరంగంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్

పెరంబూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం శ్రీరంగం రైల్వేస్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగుతాయని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, నెం.12633 చెన్నై ఎగ్మూర్-కన్నియాకుమారి, నెం.12634 కన్నియాకుమారి-చెన్నై ఎగ్మూర్, నెం.16102 కొల్లం-చెన్నై ఎగ్మూర్, నెం.16101 చెన్నై ఎగ్మూర్-కొల్లం ఎక్స్‌ప్రెస్ రైళ్లు గురు, శుక్రవారాల్లో శ్రీరంగంలో ఆగుతాయని దక్షిణ రైల్వే తెలిపింది.

గ్రూప్-4 పరీక్షకు ఉచిత శిక్షణ

పెరంబూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) గ్రూప్-4 పోస్టులను భర్తీ చేయనుంది. ఈ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు గిండిలోని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో శుక్రవారం నుంచి ఉచిత శిక్షణా తరగతులు అందించనున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు నేరుగా కార్యాలయాన్ని సంప్రదించవచ్చు. మరిన్ని వివరాలు decgc.coachingclass@gmail.com అనే వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు.

ఫిబ్రవరిలో వైద్యపోస్టుల పరీక్షా ఫలితాలు

పెరంబూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రుల్లో ఖాళీగా ఉన్న 2,553 అసిస్టెంట్ వైద్యుల పోస్టులకు వైద్య ఉద్యోగుల ఎంపిక (ఎమ్మార్బీ) కమిషన్ ఈ నెల 5వ తేది రాతపరీక్ష నిర్వహించింది. ఈ పరీక్షకు 17,701 మంది హాజరయ్యారు. ఈ పరీక్ష కీ ఆన్సర్‌ను https://mrb.tn.gov.in/ అనే వెబ్‌సైట్‌లో బుధవారం విడుదల చేశారు. ఫలితాలు ఫిబ్రవరిలో విడుదల చేస్తామని ఎమ్మార్బీ ఒక ప్రకటనలో తెలిపింది.

5 నుంచి ఆర్మీ రిక్రూట్‌మెంట్

పెరంబూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): 'అగ్నివీర్' పథకంలో భారత సైన్యంలో అర్హత కలిగిన వారిని ఎంపిక చేస్తున్నారు. ఆ ప్రకారం, టెక్నాలజీ, అసిస్టెంట్ నర్సు మెడిసిన్ విభాగాల్లో అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. తమిళనాడు, ఆంధ్ర రాష్ట్రాలకు చెందిన యువకులు వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదుచేసుకోవచ్చు. కాంచీపురం జిల్లా క్రీడా మైదానంలో ఫిబ్రవరి 5 నుంచి 15వ తేది వరకు ఎంపిక శిబిరం జరుగనుంది. పేర్లు నమోదుచేసుకున్న వారు తగిన సర్టిఫికెట్లతో హాజరుకావాల్సి ఉంది. వివరాలకు www.joinindianarmy.nic.in అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

గ్రూప్-4 పోస్టుల సంఖ్య పెంపు

పెరంబూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లోని 23 విభాగాల్లో 6,244 పోస్టులు భర్తీ చేసేందుకు టీఎన్‌పీఎస్సీ 2023లో నోటిఫికేషన్ ఇచ్చింది. గత ఏడాది జూన్ 9వ తేది నిర్వహించిన రాతపరీక్షకు 15.88 లక్షల మంది హాజరయ్యారు. ఈ పరీక్షా ఫలితాలు ఇటీవల విడుదలయ్యాయి. ఈ నేపథ్యంలో, ఈ పరీక్ష ద్వారా అదనంగా 480 పోస్టులు భర్తీచేయనున్నట్లు సెప్టెంబరు 11న టీఎన్‌పీఎస్సీ ప్రకటించింది. అలాగే, రెండో సారి విడుదల చేసిన ప్రకటనలో, ఖాళీ పోస్టులకు అదనంగా 2,208 కలిపి మొత్తం 8,932 పోస్టులు భర్తీ చేయనున్నట్లు ప్రకటించగా, మూడో సారి భర్తీ చేయనున్న పోస్టుల సంఖ్య 9,491కి పెంచింది. తాజాగా, మరో 41 ఖాళీ పోస్టులు కలిపి 9,532 పోస్టులు భర్తీ చేయనున్నట్లు టీఎన్‌పీఎస్సీ గురువారం ప్రకటన విడుదల చేసింది.

20న ఎస్సీ, ఎస్టీ 'స్టేట్ ఫోరం' తొలి సమావేశం

పెరంబూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆదిద్రావిడ, గిరిజనుల సంక్షేమానికి కేటాయిస్తున్న నిధులు, సక్రమంగా వారికి అందేలా పర్యవేక్షించేందుకు ముఖ్యమంత్రి నేతృత్వంలో 'స్టేట్ ఫోరం' ఏర్పాటైంది. ఈ ఫోరంలో ఆ శాఖ మంత్రి, ఆర్థిక మంత్రి, అటవీ శాఖ మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలున్నారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలపై సమీక్ష, నివేదిక అందజేయడం, అభివృద్ధి పథకాల రూపకల్పన, ప్రభుత్వానికి సిఫారసు చేయడం, ఈ పథకాలు పర్యవేక్షించడం తదితరాలను ఈ ఫోరం చేపట్టనుంది. ఈ ఫోరం తొలి సమావేశం సచివాలయంలో ఈ నెల 20వ తేది జరుగనుందని అధికారులు తెలిపారు.

నేడు టీవీకే జిల్లా కార్యదర్శుల సమావేశం

పెరంబూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) జిల్లా కార్యదర్శుల సమావేశం ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ నేతృత్వంలో శుక్రవారం జరుగనుంది. పనయూర్‌లోని పార్టీ కార్యాలయం జరిగే సమావేశానికి హాజరుకావాలని జిల్లా కార్యదర్శులకు ఆహ్వానాలందాయి. ఈ సమావేశంలో ఓటింగ్ పద్ధతి ద్వారా రాష్ట్ర నిర్వాహకులు, అనుబంధ సంఘాల నిర్వాహకుల ఎంపిక జరుగనున్నట్లు సమాచారం. అలాగే, గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంపై చర్చించనున్నట్లు పార్టీ వర్గాల సమాచారం.

నేటి నుంచి అదనపు ఎంటీసీ బస్సులు

పెరంబూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పొంగల్ పండుగ సందర్భంగా శుక్రవారం నుంచి ఈ నెల 13వ తేది వరకు అదనపు అనుసంధాన బస్సులు నడుపనున్నట్లు మెట్రోపాలిటిన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) తెలిపింది. పొంగల్ సందర్భంగా స్వగ్రామాలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం నగరంలోని పలు ప్రాంతాల నుంచి కోయంబేడు, కిలంబాక్కం, మాధవరం బస్ టెర్మినల్స్‌కు అదనపు బస్సులు నడుపనున్నట్లు ఎంటీసీ తెలిపింది.

ప్రగతిపథంలో రాష్ట్ర పారిశ్రామిక రంగం

● 'యుమేజిన్ టీఎన్2025' సదస్సులో సీఎం స్టాలిన్



సదస్సులో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి

చెన్నై, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక రంగంలో రాష్ట్రం ప్రగతిపథంలో పయనిస్తోందని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. గురువారం నందంబాక్కం ట్రేడ్ సెంటర్‌లో 'యుమేజిన్ టీఎన్ 2025' పేరుతో ప్రారంభమైన రెండు రోజుల సాంకేతిక సదస్సును ప్రారంభించి ఆయన ప్రసంగించారు. దీర్ఘకాలిక సాంకేతిక పరిజ్ఞానాన్వేషణ దిశగా ఈ రెండు రోజుల సదస్సు జరుగుతోందని, ప్రస్తుతం కృత్రిమ మేథోపరిజ్ఞానం (ఏఐ) సాంకేతిక రంగంలో ప్రధాన పాత్ర పోషిస్తుందని, ఏఐని ప్రోత్సహించే దిశగా కోయంబత్తూరులో ఏఐ టెక్నికల్ పార్కు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. కోయంబత్తూరు, సేలం, మదురై, తిరుచ్చి, హోసూరు, తిరునల్వేలి, వేలూరు, విల్లుపురం, తూత్తుకుడి వంటి ద్వితీయ శ్రేణ నగరాలలోనూ ఐటీ పార్కులను ఏర్పాటు చేశామని, ఆ కోవలోనే ప్రస్తుతం కోయంబత్తూరులో 'పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్' ప్రాతిపదికన ఏఐ టెక్నికల్ పార్కు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఇదేవిధంగా తమిళ సాఫ్ట్‌వేర్ రూపకల్పనకు కూడా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ఓ వైపు డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం రాకెట్ వేగంగా సాగుతుంటే, అంతే వేగంతో డిజిటల్ నేరాలు కూడా పెరగటం తనకెంతో ఆందోళన కలిగిస్తోందని స్టాలిన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సదస్సులో సమాచార సాంకేతిక శాఖ మంత్రి పళనివేల్ త్యాగరాజన్, డిజిటల్ సేవల శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి కుమార్ జయంత్, హెచ్‌సీఎల్ టెక్ సీఈఓ విజయకుమార్, హెచ్‌పీ ఇండియా సంస్థ ఉపాధ్యక్షులు ఇప్సితా దాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

హుండీలో జారిపడ్డ ఐఫోన్.. రూ.10వేలకు దక్కించుకున్న సొంతదారు

చెన్నై, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మదురై సమీపం తిరుప్పోరూరు కందసామి ఆలయం హుండీలో జారిపడ్డ ఐఫోన్‌ను దాని సొంత దారుడు రూ.10వేలకు వేలంపాడి దక్కించుకున్నాడు. రెండు నెలల క్రితం ఆ ఆలయానికి వెళ్ళి చెన్నై అంబత్తూరు వినాయకపురానికి చెందిన దినేష్ హుండీలో నగదు వేస్తుండగా అతడి జేబులోని ఐఫోన్ జారిపడింది. ఈ విషయాన్ని ఆలయ నిర్వాహకులకు ఆయన ఫిర్యాదు చేసిన ఫలితం లేకపోయింది. హుండీలో పడిన కానుకలన్నీ దేవుడికే సొంతమని చెప్పారు. చివరకు ఆ ఫోన్‌లో ఉన్న సిమ్‌కార్డ్, మెమరీ కార్డు మాత్రమే ఆలయ నిర్వాహకులు తిరిగిచ్చారు. ఈ విషయం దేవాదాయ శాఖ మంత్రి శేఖర్‌బాబు దృష్టికి వెళ్ళింది. ఐఫోన్ తిరిగి ఇచ్చే విషయమై త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెబుతామన్నారు. చివరకు హుండీలో పడిన వస్తువులను వేలం వేయాలనే ఆలయ నిబంధన ప్రకారమే దినేష్ ఐఫోన్‌కు ఆలయ నిర్వాహకులు వేలం పాడారు. దినేష్ ఆ వేలంపాటలో పాల్గొని రూ.10వేలకు తన ఐఫోన్‌ని తిరిగి దక్కించుకున్నాడు.


హుండీలో పడిన ఐఫోన్‌తో దినేష్

పెరియార్‌పై అనుచిత వ్యాఖ్యలు
సీమాన్ కారు ధ్వంసం

● ధర్నాలో పాల్గొన్న 50 మంది అరెస్ట్


ఆందోళనకారులను అరెస్టు చేస్తున్న పోలీసులు

పార్యీస్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ద్రవిడ పితామహుడు తంథై పెరియార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన నామ్ తమిళర్ పార్టీ ఆర్గనైజర్ సీమాన్‌కు వ్యతిరేకంగా పెరియార్ ద్రావిడర్ కళగం తరపున గురువారం ధర్నా నిర్వహించారు. నీలాంగరై లో ఉన్న సీమాన్ ఇంటి ముందు కారు ధ్వంసం చేసి, ముట్టడించిన సుమారు 50 మంది ఆందోళనకారులను పోలీసులు అరెస్ట్ చేశారు. కడలూరులో మీడియా సమావేశంలో మాట్లాడిన సీమాన్, తమిళం హీనమైన భాష అని పెరియార్ 50 ఏళ్ల క్రితమే వ్యాఖ్యానించారని, ఇందుకు ఆధారాలు కూడా తన వద్ద ఉన్నాయన్నారు.. అన్ని మతాలు సమానమని, భగవంతునికి స్వరూపం లేదని, జ్యోతిస్వరూపమే భగవంతుడని ప్రపంచానికి బోధించిన రామలింగ అడిగళార్ కంటే తంథై పెరియార్ గొప్ప వ్యక్తి కాదని సీమాన్ వ్యాఖ్యానించారు. సీమాన్ వ్యాఖ్యలు ఖండిస్తూ తంథై పెరియార్ ద్రావిడర్ కళగంకు చెందిన సుమారు 50 మందికి పైగా కార్యకర్తలు, నీలాంగరైలో ఉన్న సీమాన్ ఇంటి ముందు ధర్నా చేపట్టారు. వారిలో కొందరు సీమాన్ కారు అద్దాలు ధ్వంసం చేశారు. దీంతో, పోలీసులు ద్రావిడర్ కళగం ప్రధాన కార్యదర్శి కోవై రామకృష్ణన్ సహా అందర్నీ అరెస్ట్ చేశారు.



మార్కెట్‌లోకి రస్కిక్ గ్లూకో ఎనర్జీ

అడయార్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రిలయన్స్ కన్జూమర్ ప్రొడక్ట్ (ఆర్‌సీపీఎల్) బేవరేజెస్ మార్కెట్‌లోకి కొత్తగా రస్కిక్ గ్లూకో ఎనర్జీ డ్రింక్ ప్రవేశపెట్టింది. ఈ ఎనర్జీ డ్రింక్‌ను ఎలక్ట్రొలైట్స్, గ్లూకోస్, రియల్ లెమన్ జ్యూస్ వంటివాటితో తయారు చేశారు. నిరంతరం శ్రమించే వారికి తక్షణ శక్తినిచ్చేలా ఈ పానీయాన్ని తయారు చేశారు. సింగిల్ సర్వ్ ప్యాక్ ధర రూ.10గా నిర్ణయించారు. రస్కిక్ గ్లూకో ఎనర్జీని ప్రవేశపెట్టడం వల్ల ఆర్‌సీపీఎల్ రీ హైడ్రేషన్ విభాగం వర్గాన్ని ఆకర్షించడంతో పాటు ఎల్లవేళలా రీఫ్రెష్‌గా ఉండేలా దోహదపడుతుందని ఆర్‌సీపీఎల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కేతన్ మోదీ వెల్లడించారు.

ఆభరణాల డిపాజిట్ ద్వారా రూ.11 కోట్ల ఆదాయం

● మంత్రి శేఖర్‌బాబు

ప్యారీస్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆలయాలకు చెందిన 1,100 కిలోల ఆభరణాలు బ్యాంకులో డిపాజిట్ చేయడం ద్వారా ఏడాదికి రూ.11 కోట్ల ఆదాయం వస్తోందని దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు వివరించారు. గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రశ్నోత్తర సమయంలో ఆలంగుళం ఎమ్మెల్యే మనోజ్ పాండ్యన్ తమ నియోజకవర్గంలోని మేట్టూరు సుబ్రమణ్యస్వామి ఆలయం, కూలంగుళం కాళియమ్మన్ ఆలయం, పాపాకుడి మునీశ్వర ఆలయాలకు కుంభాభిషేకం నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కోరారు. దానికి సమాధానం చెప్పిన మంత్రి శేఖర్‌బాబు సభ్యుడు కోరిన అమ్మవారు, సుబ్రమణ్యస్వామి, శివాలయాలకు ఈ ఏడాది డిసెంబరులోపే కుంభాభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేటినుంచి ఈరోడ్ ఈస్ట్ ఉప ఎన్నిక నామినేషన్లు

● 5 కంపెనీల పారామిలిటరీ బలగాలతో బందోబస్తు

అడయార్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక ప్రక్రియలో భాగంగా శుక్రవారం నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో నామినేషన్ల దాఖలకు సమయం కేవలం మూడు రోజుల పాటు మాత్రమే అవకాశం ఉంది. సంక్రాంతి సెలవుల కారణంగా నామినేషన్లను 10, 13, 17వ తేదీల్లో మాత్రమే స్వీకరిస్తారు. ఈ అసెంబ్లీ స్థానానికి ప్రాతినిథ్యం వహించిన టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు ఈవీకేఎస్ ఇళంగోవన్ ఇటీవల మృతి చెందిన విషయం తెల్సిందే. దీంతో ఈ సెగ్మెంట్‌కు ఉప ఎన్నిక నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. అదేసమయంలో నియోజకవర్గ వ్యాప్తంగా భద్రత పెంచడంతో పాటు నగదు అక్రమ రవాణా అడ్డుకునేందుక ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. ఈ స్క్వాడ్ జరిపిన తనిఖీల్లో ఒక కాంట్రాక్టర్ ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళుతున్న లక్ష రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఉప ఎన్నిక కోసం భద్రతగా ఐదు కంపెనీల పారామిలిటరీ బలగాలను ఉపయోగించనున్నారు. మరోవైపు, నగదు అక్రమ రవాణాను అడ్డుకునేందుకు మూడు ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను నియమించి, మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తున్నారు.

అద్దెకు హౌసింగ్ బోర్డు ఇళ్లు

● మంత్రి ముత్తుస్వామి

ప్యారీస్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు హౌసింగ్ బోర్డు (టీఎన్‌హెచ్‌బీ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్మిస్తున్న ఇళ్ల అద్దెకు కేటాయించనున్నట్లు హౌసింగ్ శాఖ మంత్రి ఎస్.ముత్తుస్వామి పేర్కొన్నారు. గురువారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో కాంచీపురం ఎమ్మెల్యే ఎళిలరసన్ తమ నియోజకవర్గంలో టీఎన్‌హెచ్‌బీ ద్వారా వాణిజ్య కాంప్లెక్స్ నిర్మిస్తారా అని ప్రశ్నించారు. అందుకు మంత్రి రాష్ట్రవ్యాప్తంగా 60 ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరుకున్న సుమారు 10 వేలకు పైగా క్వార్టర్స్ కూల్చివేసి, కొత్తవి నిర్మించే చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

చేనేత, వస్త్ర ప్రదర్శనకు విశేష స్పందన



చెన్నై, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాయపేట వైఎంసీఏ మైదానంలో ఏర్పాటైన 'కాటన్ అండ్ సిల్క్ ఫ్యాబ్' ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. దేశం నలుమూలల నుంచి వందమందికి పైగా మాస్టర్ వీవర్స్ తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శనలో సిల్క్‌చీరలు, సూట్స్, డ్రెస్ మెటీరియల్, స్టోల్స్, దుపట్టా, టస్సార్ సిల్క్, కాంతిపూర్ సిల్క్, ఒడిశా సంబల్‌పురి ఇక్కత్ సిల్క్ చీరలు, బీహార్ టస్సార్ సిల్క్ చీరలు, అసోం ముగా, ఏరి సిల్క్ చీరలు, జార్జెట్ సిల్క్, ఆరణి సిల్క్, ప్రింటెడ్ చీరలు, కాంచీపురం సిల్క్, ధర్మవరం, ఉప్పాడ, గద్వాల్, మంగళగిరి, పోచంపల్లి చీరలు, మల్బరీ సిల్క్, జందానీ, సమవార్ సిల్క్ చీరలు, షిఫాన్ సిల్క్, మహారాష్ట్ర డిజైనర్ డ్రెస్ మెటీరియల్స్ ఇక్కడ అందుబాటులో వున్నట్లు నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి రోజూ ఉదయం 10.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు జరిగే ఈ ప్రదర్శనలో అన్ని క్రెడిట్, డెబిట్ కార్డులు చెల్లుతాయని వివరించారు. ఈ నెల 13వ తేదీ వరకు జరిగే ఈ ప్రదర్శన ప్రవేశం ఉచితమని పేర్కొన్నారు.

వీఐటీ చెన్నైలో అంబరాన్నంటిన పొంగల్ వేడుకలు


పొంగల్ వేడుకల్లో అమెరికాకు చెందిన ప్రభు డేవిడ్, వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్ తదితరులు

పెరంబూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీఐటీ చెన్నై యూనివర్సిటీ ప్రాంగణంలో గురువారం పొంగల్ వేడుకలు కోలాహలంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 3 నుంచి గురువారం వరకు విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. గురువారం వర్సిటీ ప్రాంగణంలో జరిగిన సమత్తువ పొంగల్ వేడుకలకు వర్సిటీ ఛాన్సలర్ కె.విశ్వనాథన్, వర్సిటీ ఉపాధ్యక్షుడు జీవీ సెల్వం నేతృత్వం వహించారు. ముఖ్యఅతిథులుగా అమెరికాకు చెందిన ఆర్‌ఐటీ విద్యా సంస్థల అధ్యక్షుడు ప్రభు డేవిడ్ సహా 30 మంది పాల్గొన్నారు. ముఖ్యఅతిథులకు వర్సిటీ నిర్వాహకులు తలపాగా చుట్టి, చెరకు గడలు అందజేశారు. అనంతరం ముఖ్యఅతిథుల సమక్షంలో పొంగళ్లు పెట్టారు. వేడుకల్లో భాగంగా జల్లికట్టు ఎద్దు ప్రదర్శన సహా గ్రామీణ కళారూపాలు అతిథులను అబ్బురపరిచాయి. అనంతరం ఆరింజర్ అన్నా తమిళ్ మండ్రం నిర్వహించిన వేడుకలకు వీఐటీ వర్సిటీ ఉపాధ్యక్షులు జీవీ సెల్వం, డిప్యూటీ ఛాన్సలర్ త్యాగరాజన్, అదనపు రిజిస్ట్రార్ పీకే మనోహరన్ తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.. ఈ కార్యక్రమంలో ప్రముఖ నేపథ్యగాయకులు వేల్‌మురుగన్ బృందం ఆలపించిన గీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

రెండు రాష్ట్రాల్లో క్యాన్సర్‌పై అవగాహన


ప్రసంగిస్తున్న డా.ఎస్.జిమ్మన్ తదితరులు

అడయార్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ది అసోసియేషన్ ఆఫ్ ఓరల్ అండ్ మాక్సిలోఫేషియల్ సర్జన్స్ ఆఫ్ ఇండియా (ఏవోఎంఎస్ఐ)కు చెందిన తమిళనాడు, పుదుచ్చేరి శాఖల ఆధ్వర్యంలో 'క్యాన్సర్ కేర్ కనెక్ట్' పేరుతో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ విషయమై ఏవోఎంఎస్ఐ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డా.ఎస్.జిమ్మన్ నగరంలో ఇటీవల జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఈ ఏడాది ఆఖరు నాటికి సుమారు 20వేల మందికి అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఏవోఎంఎస్ఐ తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల కార్యదర్శి డా.కె.అరుణ్‌కుమార్, క్యాన్సర్ కేర్ కనెక్ట్ సమన్వయకర్త, ఏవోఎంఎస్ఐ సంయుక్త కార్యదర్శి డా.సెంథిల్‌మురుగన్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలు డా.స్నేహ, డా.ఇలవేనిల్ పన్నీర్‌సెల్వం తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి భవానీసాగర్ డ్యాం నీటి విడుదల

పెరంబూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా భవానీసాగర్ డ్యాం నుంచి కీల్‌భవాని ఆయకట్టుకు శుక్రవారం నుంచి మే 1వ తేది వరకు నీటిని విడుదల చేయనున్నారు. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... ఈరోడ్ జిల్లాలోని సత్యమంగళం, నంబియూర్, గోపిచెట్టిపాళయం, భవానీ, పెరుందురై, మడకుర్చి, కొడుముడి తదితర జిల్లాలు, తిరుప్పూర్ జిల్లాలోని కాంగేయం తాలూకా, కరూర్ జిల్లాలోని అరవకుర్చి తాలూకా మొత్తం 1,03,500 ఎకరాలకు లబ్ధి పొందుతాయని ప్రభుత్వం తెలిపింది.

ఈపీఎస్ బంధువు ఇళ్లల్లో ఐటీ తనిఖీలు

అడయార్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లాలో మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె.పళనిస్వామికి చెందిన బంధువుల ఇళ్లు, కార్యాలయాల్లో ఆదాయపన్ను శాఖ అధికారులు మూడో రోజైన బుధవారం కూడా తనిఖీలు చేశారు. ఈరోడ్‌కు చెందిన అవల్‌పూందురైకు చెందిన రామలింగం అనే వ్యాపారవేత్తకు ఎన్ఆర్ రియల్ ఎస్టేట్, టోల్ ప్లాజా, కల్యాణ మండపాలు, టార్చ్ పిండిమిల్లు ఇలా అనేక వ్యాపారాలున్నాయి. వీటికి ఆయన కుమారుడు సూర్యకాంత్ సహా మరికొందరు డైరెక్టర్లుగా ఉన్నారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు నడుపుతోంది. అయితే, గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో రామలింగం ఆస్తులు భారీగా పెరిగాయి. దీనికి కారణం నాటి ముఖ్యమంత్రి ఈపీఎస్ బంధువు కావడంతో రామలింగం ఆస్తులు బాగా కూడబెట్టుకున్నారనే ప్రచారం జరిగింది. అదేసమయంలో భారీగా పన్ను ఎగవేతకు పాల్పడినట్టు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆదాయపన్ను శాఖ అధికారులు ఈ నెల 7వ తేదీ నుంచి రామలింగం, ఆయన బంధువులకు చెందిన గృహాలు, కార్యాలయాల్లో తనిఖీలు చేస్తున్నారు. ఈ తనిఖీలు మూడోరోజైన బుధవారం కూడా కొనసాగాయి.

అసెంబ్లీ ప్రసారాల్లో పారదర్శకత లేదు

● ప్రతిపక్షనేత ఎడప్పాడి

ప్యారీస్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలపై జరిగే చర్చలకు సంబంధించిన వీడియో ప్రసారాల్లో పారదర్శకత లేదని, ఉద్దేశపూర్వంగా ప్రతిపక్షాల వైపు కెమెరాలు తిప్పడం లేదని ప్రతిపక్ష నేత, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఆరోపించారు. ఆయన గురువారం తన ఎక్స్ పేజీలో... అసెంబ్లీ ప్రసారాలు సక్రమంగా ప్రసారం చేయడం లేదని విమర్శించారు. ప్రజల సంక్షేమానికి సంబంధించి ప్రతిపక్ష ఎమ్మెల్యేలు అడిగే ప్రశ్నలు ప్రజలు చూడరాదన్న భావనతోనే సీఎం స్టాలిన్ మోడల్ ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఎడప్పాడి విమర్శించారు. ఇదిలా వుండగా గురువారం కూడా సమావేశాలకు ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు నల్లచొక్కాలు ధరించి వచ్చారు.

నెల్లై కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు

అడయార్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరునెల్వేలి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు గురువారం వేకువజామున బాంబు బెదిరింపు వచ్చింది. ఈ కార్యాలయంలో వంద మందికిపైగా పనిచేస్తున్నారు. అయితే, బుధవారం అర్ధరాత్రి 1.20 గంటల సమయంలో అగంతకుడు ఫోన్ చేసి, కలెక్టరేట్‌లో బాంబు పెట్టినట్టు చెప్పి, ఫోన్ కట్ చేశాడు. దీంతో అప్రమత్తమైన సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన రంగంలోకి దిగిన పోలీసులు కలెక్టరేట్ అంతా తనిఖీ చేసి ఎలాంటి బాంబు లేదని నిర్ధారించారు. అలాగే, ఫోన్‌కాల్ ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టగా ఈ బాంబు బెదిరింపునకు పాల్పడిన రహ్మాన్ (45)అనే వ్యక్తిగా గుర్తించి అరెస్టు చేసి విచారణ జరుపుతున్నారు.

మంత్రి సెంథిల్ బాలాజీ కేసు కోర్టులో అదనపు ఛార్జిషీటు

ప్యారీస్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అక్రమ నగదు బట్వాడా కేసులో రాష్ట్ర మంత్రి సెంథిల్ బాలాజీపై న్యాయస్థానంలో అదనపు ఛార్జిషీటు దాఖలుచేసినట్లు ఈడీ అధికారులు తెలిపారు. మంత్రి సెంథిల్ బాలాజీని గత సంవత్సరం జూన్ 14వ తేది ఈడీ అధికారులు అరెస్ట్ చేయడంతో, ఆయనను మంత్రి పదవి నుంచి తప్పించారు. సుమారు 471 రోజులు పుళల్ సెంట్రల్ జైలులో గడిపిన సెంథిల్ బాలాజి, సుప్రీంకోర్టు తీర్పుతో సెప్టెంబరు 26న బెయిలుపై విడుదలయ్యారు. దీంతో మళ్లీ మంత్రిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో, సెంథిల్ బాలాజీకి వ్యతిరేకంగా దాఖలైన అక్రమ నగదు బట్వాడా కేసులో ఈడీ అధికారులు చెన్నై ప్రిన్సిపల్ కోర్టులో అదనపు ఛార్జిషీటు దాఖలుచేశారు. అందులో మంత్రి సోదరుడు అశోక్‌కుమార్, సహాయకుడు షణ్ముగం సహా 13 మందిపై అదనపు ఛార్జిషీటు దాఖలైంది.

అర్ధవార్షిక పరీక్షల్లో తక్కువ మార్కులు

9వ తరగతి విద్యార్థి ఆత్మహత్య

పెరంబూర్,జనవరి9(ఆంధ్రజ్యోతి): అర్ధవార్షిక పరీక్షల్లో తక్కువ మార్కులొచ్చాయంటూ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడినఘటన విషాదం నింపింది. కోవై సమీపం వడవల్లి మహారాణి అవెన్యూ నగర్‌కు చెందిన బ్యూలా కుమారుడు సతీంద్ర (14) ఓ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. చదువులో చురుగ్గా ఉండే సతీంద్ర పరీక్షల్లో ఎప్పుడూ మొదటి స్థానంలో నిలిచేవాడు. గత నెల జరిగిన అర్ధవార్షిక పరీక్షలను సతీంద్ర సరిగా రాయకపోవడంతో, రెండో స్థానంలో నిలిచాడు. ఈ విషయమై సహచర విద్యార్థులకు చెప్పి సతీంద్ర విలపించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో, ఘటన జరిగిన రోజున పాఠశాల నుంచి ఇంటికొచ్చిన సతీంద్ర తల్లితో మాట్లాడి తన గదికి వెళ్లాడు. ఎంతసేపటికి కుమారుడు గది నుంచి బయటకు రాకపోవడంతో తల్లి వెళ్లి చూడగా ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడి కుమారుడిని చూసి బోరున విలపించింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

నలుగురు రౌడీల అరెస్టు

అడయార్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక న్యూ ఆవడి రోడ్డులో ఒక యువతిని బెదిరించి డబ్బులు దోచుకున్న ఘటనలో నలుగురు రౌడీలను పోలీసులు అరెస్టు చేశారు. వారిని అన్నా నగర్ ప్రాంతంలో పేరుమోసిన రౌడీలుగా చెలామణి అవుతున్న జోసెఫ్, కృపా, సూర్య, డేనియల్‌గా గుర్తించారు. అన్నా నగర్‌కు చెందిన 28 యేళ్ళ అవివాహిత న్యూ ఆవడి రోడ్డులో బుధవారం బిర్యానీ విక్రయిస్తుండగా వచ్చిన ఈ నలుగురు ఆ యువతిని బెదిరించి డబ్బులు దోచుకున్నారు.బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు..నిందితులనుగుర్తించి అరెస్టు చేశారు.

51 మంది బీజేపీ కార్యకర్తలపై కేసు నమోదు

అడయార్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనా తీరంలో నిషేధాజ్ఞలు ఉల్లంఘించి ఆందోళనకు ప్రయత్నించిన 51 మంది బీజేపీ కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదు చేశారు. విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనను ఖండిస్తూ వారు మెరీనాలో ఆందోళన చేయాలని భావించగా, పోలీసులు అనుమతివ్వలేదు. పైగా మెరీనాలో ఎలాంటి ఆందోళన కార్యక్రమాలు చేపట్టకుండా నిషేధాజ్ఞలున్నాయి. వీటిని ఉల్లంఘిచడంతో బీజేపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు.

పొంగల్ బహుమతిలో కానరాని నగదు

● బోసిపోయిన రేషన్ దుకాణాలు

పెరంబూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పొంగల్ బహుమతుల పంపిణీ గురువారం ప్రారంభమైంది. సైదాపేటలోని రేషన్ దుకాణంలో ముఖ్యమంత్రి స్టాలిన్ బహుమతుల పంపిణీ ప్రారంభించారు. పొంగల్ పండును పేదలు కూడా ఆనందంగా జరుపుకొనేలా రాష్ట్రప్రభుత్వం పలు సరుకులతో పాటు నగదు కూడా అందజేసేది. కానీ, ఈ ఏడాది పొంగల్ బహుమతిలో నగదు మాత్రం ప్రభుత్వం ప్రకటించలేదు. సాధారణంగా పొంగల్ బహుమతి తీసుకొనేందుకు ప్రజలు ఉదయం 6 గంటల నుంచే రేషన్ దుకాణాల వద్ద వేచి ఉంటారు. కానీ, ఈ సంవత్సరం మాత్రం రేషన్ దుకాణాలో బోసిపోయి కనిపించాయి. ఈ ఏడాది పొంగల్ బహుమతిలో నగదు లేకపోవడంతో రేషన్‌కార్డుదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రజలు అసంతృప్తిగా లేరు: మంత్రి పెరియకరుప్పన్

పొంగల్ బహుమతి అందించేందుకు 99 శాతం టోకెన్లు పంపిణీ చేశామన్నారు. ఈ బహుమతిలో రూ.1,000 నగదు లేకపోవడంతో ప్రజలు ఎలాంటి అసంతృప్తి చెందలేదని తెలిపారు. అదే సమయంలో 1.15 కోట్ల మంది మహిళలకు అందించే సాధికారిక నిధులు ప్రతినెలా 15వ తేది అందిస్తుండగా, ఈ నెల 10వ తేదీనే ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటనపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారని మంత్రి తెలిపారు.


గురువారం రాజ్‌భవన్‌లో జరిగిన పొంగల్ వేడుకల్లో గవర్నర్ ఆర్ఎన్ రవి దంపతులు


'కొంజనాల్ పోరు తలైవా'లో ఓ దృశ్యం

త్వరలో 'కొంజనాల్ పోరు తలైవా'...

ఆరుంధ్రన్ పిక్చర్స్ పతాకంపై ఎస్.మురుగన్ నిర్మాణ సారథ్యంలో నూతన దర్శకుడు విఘ్నేష్ పాండియన్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'కొంజనాల్ పోరు తలైవా'. పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్న ఈ చిత్రాన్ని త్వరలోనే విడుదల చేసేలా సన్నాహాలు చేస్తున్నారు. నిషాంత్ రూషో, గాయత్రిషాన్ జంటగా నటించన ఈ చిత్రంలో బాలశరవణన్, లొల్లు సభ మారన్, గుంకీ అశ్విన్, సూపర్‌గుడ్ సుబ్రమణియం తదితరులు నటించారు. మొట్టై రాజేంద్రన్ లవర్ బాయ్‌గాను 'జైలర్' ఫేం హర్షద్ ప్రతినాయకుడి పాత్రల్లో కనిపించనున్నారు. తిరుచ్చి, మదురై, కొడైక్కెనాల్ తదితర ప్రాంతాల్లో చిత్రీకరణ పనులు పూర్తి చేశారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ జరుగుతోంది. ఈ సినిమా గురించి దర్శకుడు వివరిస్తూ, 'జీవితంలో ఎలాంటి సమస్య ఉత్పన్నమైనా దానికి ఆత్మహత్య పరిష్కారం కాదు' అనే సందేశంతో రూపొందస్తున్నాం. హీరోహీరోయిన్ల మధ్య రొమాన్స్ హాస్యం వంటి అంశాలతో కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్నాం. ప్రముఖ దర్శకులు శక్తి చిదంబరం, రమేష్ సెల్వన్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేసి, ఈ సినిమా ద్వారా దర్శకుడుగా పరిచయమవుతున్నాను. త్వరలోనే ఆడియో, ట్రైలర్ రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని పేర్కొన్నారు.

నేడు మూడు సినిమాలు విడుదల


'వణంగాన్'లో అరుణ్ విజయ్ - రోషిణి ప్రకాష్

కొత్త సంవత్సరంలో జనవరి రెండో శుక్రవారమైన 10వ తేదీ మూడు చిత్రాలు విడుదలవుతున్నాయి. వీటిలో ఒకటి అరుణ్ విజయ్ నటించిన 'వణంగాన్' కాగా, రెండో మూవీ షేర్ నిగమ్, కలైయరసన్ నటించిన 'మద్రాస్‌కారన్', మూడోది రామ్ చరణ్ - శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కిన 'గేమ్ ఛేంజర్' తమిళ డబ్బింగ్ మూవీ. ప్రముఖ దర్శకుడు బాలా - అరుణ్ విజయ్ కాంబినేషన్‌లో వచ్చే తొలి చిత్రం 'వణంగాన్' పై భారీ అంచనాలున్నాయి. బాలా దర్శకత్వం వహించిన సినిమా చాలా రోజుల తర్వాత విడుదలవుతుంది. అలాగే, తమిళం, మలయాళ భాషల్లో తెరకెక్కిన 'మద్రాస్‌కారన్' కూడా శుక్రవారం రిలీజ్ చేస్తున్నారు. అయితే, ఈ నెల 12వ తేదీ 'మద గజ రాజా' మూవీ, జనవరి 14న 'కాదలిక్క నేరమిల్లై', 'నేసిప్పాయ', 'తరుణం' మూవీలను రిలీజ్ చేస్తున్నారు.

మే డే రోజున 'రెట్రో'


'రెట్రో'లో సూర్య

కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో హీరో సూర్య నటిస్తున్న కొత్త చిత్రం 'రెట్రో' మే ఒకటో తేదీ విడుదల చేయనున్నట్టు మేకర్స్ అధికారికంగా వెల్లడించారు. 2డీ ఎంటర్‌టైన్మెంట్, స్టోన్‌బెంచ్ సంస్థలు సంయుక్తంగా నిర్మించే ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం. ఇందులో జయరామ్, జోజు జార్జ్, పూజా హెగ్డే, కరుణాకరన్ తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే తొలి షెడ్యూల్ పూర్తి చేసుకున్న ఈ సినిమా చివరి షెడ్యూల్‌పై దృష్టిసారించింది. ఈ నేపథ్యంలో రెట్రోను మే ఒకటో తేదీ విడుదల చేయనున్నట్టు వెల్లడించారు. కాగా, మరో అగ్రహీరో అజిత్ నటించిన 'విడాముయర్చి' మూవీ ఏప్రిల్ 10వ తేదీ విడుదల చేయనున్నట్టు ప్రకటించడంతో రెట్రో మూవీని మే నెలలో విడుదల చేయాలని నిర్ణయించినట్టు తెలుస్తుంది.

'రాజాసాబ్'తో ఆ ఆశ నెరవేరింది

తమిళ చిత్రజ్యోతి



● మాళవికా మోహనన్

టాలీవుడ్ అగ్రహీరో ప్రభాస్‌తో నటించాలన్న చిరకాల కోరిక ఎట్టకేలకు నెరవేరిందని మలయాళ బ్యూటీ మాళవికా మోహనన్ వెల్లడించారు. ఆమె తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన సినిమా అవకాశాలపై స్పందించారు. 'నేను తమిళ చిత్రపరిశ్రమలోకి 'పేట' సినిమాతో అడుగుపెట్టాను. ఆ తర్వాత 'మాస్టర్', 'తంగలాన్' చిత్రాల్లో నటించి అభిమానులతో పాటు ఇజేమ్ సొంతం చేసుకుంది. అలా ముగ్గురు అగ్రహీరోలతో నటించే అవకాశం ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన అతి తక్కువ కాలంలోనే లభించింది. అలాగే, టాలీవుడ్‌లో మూవీల్లో 'బాహుబలి' మూవీ అంటే అమితమైన ఇష్టం. అప్పటి నుంచి హీరో ప్రభాస్ సరసన నటించాలని ఆశపడ్డాను. ఆ సమయంలో 'సలార్' మూవీలో నటించే అవకాశం వచ్చింది. కానీ, కొన్ని కారణాలతో ఈ అవకాశాన్ని తృటిలో కోల్పోయాను. కానీ, 'రాజాసాబ్' మూవీలో మళ్ళీ అవకాశాన్ని దక్కించుకోవడం సంతోషంగా ఉంది. అలా నా దీర్ఘకాల ఆశ నెరవేరింది. ఇపుడు తమిళం, తెలుగు భాషల్లో పలు అవకాశాలు వస్తున్నాయి' అని పేర్కొన్నారు.


ఆధ్యాత్మికం

శ్రీరాముడు నడయాడిన ప్రాంతం

నెడుంకుండ్రం దివ్యక్షేత్రం

● పద్మాసనంలో దర్శనమిస్తున్న కోదండపాణి


యోగభంగిమలో శ్రీరాముడు



తిరువణ్ణామలై జిల్లా నెడుంకుండ్రం వద్ద శ్రీరామచంద్రమూర్తి పద్మాసనం వేసుకుని భక్తులకు దర్శనమిస్తున్నారు. మహాభారతాన్ని రచించిన వ్యాసమహర్షి కుమారుడు శుక బ్రహ్మ. ఆయన చిలుక శిరస్సు, మానవదేహం కలిగి ఉంటారు. పూర్వం శుకబ్రహ్మర్షి ఈ క్షేత్రంలో శ్రీరాముడి కోసం తపస్స చేశారు. రావణాసురుడిని వధించిన తర్వాత అయోధ్యకు వెళ్తూ మార్గమధ్యంలో రామచంద్రమూర్తి శుకబ్రహ్మ ఆశ్రమంలో బస చేస్తారని అశరీరవాణి ప్రకటించింది. ఆ మేరకు దశకంఠుడైన రావణాసురుడిని వధించిన తర్వాత శ్రీరామచంద్రుడు అయోధ్యకు తిరిగి వెళ్తూ మార్గమధ్యంలో శుక మహర్షి ఆశ్రమాన్ని సందర్శించారు. ఆ సందర్భంగా శుక మహర్షి తాను భద్రపరచిన బ్రహ్మసూత్ర తాళపత్రాన్ని శ్రీరాముడికిచ్చారు. ఆ తాళపత్రాన్ని చదవమని ఆంజనేయుడిని ఆదేశించారు. హనుమంతుడు ఆ తాళపత్రాన్ని పద్మాసనం వేసుకుని చదువుతుండగా, శ్రీరాముడు తాత్పర్యం చెప్పారు. ఆ తర్వాత శుకబ్రహ్మ కోరిక మేరకు శ్రీరామచంద్రుడు అక్కడ ఓ రోజు బసచేశారు. ఈ క్షేత్రంలో సీతాదేవి, లక్ష్మణుడు, హనుమంతుడికి శాస్త్ర వివరణ ఉపదేశించిన శ్రీరాముడు పద్మాసనం వేసుకుని ఆవిర్భవించారన్నది ఐతిహ్యం.

\- టి.నగర్, ఆంధ్రజ్యోతి

ఆలయ వైభవం..

ఈ ఆలయం ఐదంతస్థుల రాజగోపురంతో మలచబడింది. ఆలయంలోకి ప్రవేశించగానే కుడివైపు కల్యాణమండపం, ఎడమవైపు పదహారు కాళ్ల ఊయల మండపం దర్శనమిస్తాయి. బయటి ప్రాకారంలో బలిపీఠం, ధ్వజస్తంభం, రెండో ప్రహరీ, ఐదంతస్థుల గోపురం కనిపిస్తాయి. గర్భాలయంలో కుడివైపు లక్ష్మణుడు ధనుర్బాణాలతో భక్తులకు దర్శనమిస్తారు. ఎడమవైపు సీతాదేవి కుడిచేత తామరపుష్పాన్ని పట్టుకుని దర్శనమిస్తోంది. వీరిద్దరి నడుమ పద్మాసనంలో శ్రీరామచంద్రమూర్తి యోగస్థితిలో దర్శనమివ్వటం ఈ ఆలయ విశేషం. రాముడి చేతిలో ఆయుధాలుండవు. శ్రీరాముడికి ఎదురుగా హనుమంతుడు కూడా పద్మాసనం వేసుకుని బ్రహ్మ సూత్ర తాళపత్రాలను పట్టుకుని పఠిస్తున్నట్టుగా ఉంటాడు. ఈ ఆలయ ఉత్సవమూర్తి విజయరాఘవపెరుమాళ్ శ్రీదేవి, భూదేవి సమేతంగా పూజలందుకుంటున్నారు.. అర్థ మండపంలో కుడివైపు విశ్వక్సేనులు, ఆళవందార్, ఆళ్వార్ల విగ్రహాలున్నాయి.. వెలుపలి ప్రాకారం వాయువ్యదిశగా సెంగమలవల్లి అమ్మవారు ప్రత్యేక సన్నిధిలో కొలువుదీరారు. యోగరాముడి ఆలయం ఎదురుగా సంజీవి హనుమాన్ సన్నిధి కూడా ఉంది. ఇక్కడ ఏకమూర్తిగా ద్విహనుమాన్ దర్శనమివ్వటం కూడా విశేషం.


ఆలయం వెనుక దీర్ఘాచల పర్వతం

ఆలయ విశేషాలు..

ఈ క్షేత్రంలో శుక్రతీర్థం లేదా సూర్యతీర్థం పేరుతో తీర్థ కొలను కూడా ఉంది. తిరువణ్ణామలై క్షేత్రంలో ఆలయం వెనుక అరుణాచల పర్వతం ఉన్నట్టుగానే ఈ యోగ రామాలయం వెనుక చిలుక రూపంతో పచ్చటి దీర్ఘాచల పర్వతం ఉంది. ఆడి నెలలో పవిత్రోత్సవం, వయ్యాశి నెలలో గరుడ సేవ, కృష్ణ జయంతి, రామనవమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.

ఆలయ అంతర ప్రాకారం



ఏకమూర్తిగా ద్విహనుమాన్



నృత్య మండపం




అంతర ప్రాకారంలో దశావతార కుడ్య శిల్పాలు - కిళి గోపురం



ఎలా వెళ్లాలి?

నెడుంకుండ్రం వైష్ణవ క్షేత్రం వందవాసి నుంచి సేత్తుపట్టు వెళ్లే రహదారిలో ఉంది. తిరువణ్ణామలైకి 55 కి.మీ. దూరంలో, ఆరణి నుంచి 24 కి.మీ. దూరంలో వందవాసి నుండి 25. కి.మీ దూరంలో ఉంది. చెన్నై సహా పలు నగరాల నుంచి తిరువణ్ణామలైకి, ఆరణికి రాష్ట్ర రవాణా సంస్థ బస్సులు నడుపుతోంది. తిరువణ్ణామలై నుండి ఈ క్షేత్రానికి బస్సులు అందుబాటులో ఉన్నాయి. వందవాసి నుండి సేత్తుపట్టుకు ప్రభుత్వ, ప్రైవేటు బస్సులు నడుపుతున్నారు. ఈ ఆలయాన్ని రోజూ ఉదయం 7 నుండి 11 గంటల వరకు, మళ్ళీ సాయంత్రం 5.30 నుండి రాత్రి 8 గంటలకు వరకు తెరచి ఉంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

పదహారుకాళ్ల మంటపం



మహిళా విద్యతోనే దేశాభివృద్ధి

● ప్రముఖ దంత వైద్యులు ఎమ్మెస్ రాణి ● ఘనంగా కేటీసీటీ పాఠశాలల వార్షికోత్సవాలు

ప్యారీస్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మహిళా విద్యతోనే దేశం ప్రగతి పథంలో నడుస్తుందని కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన ప్రముఖ దంత వైద్యురాలు ఎమ్మెస్ రాణి పేర్కొన్నారు జార్జిటౌన్‌లోని కన్యకా పరమేశ్వరం దేవస్థానం (ఎస్కేపీడీ) నిర్వహణలోని కేటీసీటీ ప్రాథమిక, మహోన్నత బాలికల పాఠశాలల వార్షికోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆదియప్ప వీధిలో ఉన్న ఎస్కేపీసీ కన్వెన్షన్ సెంటర్‌లో పాఠశాలల గౌరవ కరస్పాండెంట్ సోలేటి లోకయ్యన్ సుదర్శనం స్వాగతోపన్యాసంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డా.ఎమ్మెస్ రాణి మాట్లాడుతూ.. ప్రాథమిక విద్య దశ నుంచే బాలికలు శ్రద్ధగా చదువుకొని దేశం, కుటుంబాభివృద్ధికి సాయపడేలా ఉన్నతస్థాయికి చేరాలని సూచించారు. పూర్వ విద్యార్థిని అయిన తాను ఘనచరిత్ర కలిగిన కేటీసీటీ విద్యాసంస్థల వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథి, కరస్పాండెంట్‌ను కేటీసీటీ బాలికల మహోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.అనిల, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చుక్కా రేవతి ఘనంగా సత్కరించారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. రెండు పాఠశాలల విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.


విద్యార్థినులతో నిర్వాహకులు, ముఖ్యఅతిథి

మోహినిరూపంలో శ్రీరంగనాథుడు

చెన్నై, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అష్టోత్తర శత వైష్ణవదివ్యదేశాల్లో మొదటి దివ్యదేశంగా, 'భూలోక వైకుంఠం' కీర్తింపబడుతున్న శ్రీరంగం రంగనాథస్వామి ఆలయంలో గురువారం వైకుంఠ ఏకాదశి రాపత్తు వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు డిసెంబర్ 30న తిరునెడుంతాండకంతో ప్రారంభమైంది. అదే విధంగా 31న పగల్‌పత్తు తిరువాయ్‌మొళి తిరునాళ్ వేడుకలు కూడా ఆరంభమయ్యాయి. ఈ వేడుకలను పురస్కరించుకుని నంబెరుమాళ్ రోజూ ఉదయం వివిధ అలంకారాల్లో మూలస్థానం నుండి బయలుదేరి అర్జున మండపంలో వేంచేసి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ నేపథ్యంలో పగల్‌పత్తు ఉత్సవాల ప్రారంభం సందర్భంగా గురువారం ఉదయం స్వామివారు మోహిని అవతారంలో దర్శనమిచ్చారు. అంతేకాక సవరం కొప్పు, దానికి నడుమ కళింగత్తు రాయ్, నుదుటి బొట్టు, ముత్యపు పట్ట, వజ్రాలు పొదిగిన జిమికీలు, ముక్కుపుడక, హృదయబాగాన పంగుణి ఉత్తిర పతకం, దానిపై అమ్మవారి తిరుమాంగళ్యం, అళగియ మనవాళ్ పతకం, బంగారు ఉసిరిక మాల, పగడాల మాల, స్వర్ణ కాసుల మాల, కుడిచేయిలో బంగారుగాజులు, తాయత్తు ధరించి స్వామివారు విశ్వమోహనాకారుడిగా భక్తకోటిని మైమరపించారు. యేడాదికొకమారు మాత్రమే సంపూర్ణ స్వర్ణ, సర్వాలంకరణలతో మోహినీ అవతారంలో స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. శుక్రవారం వేకువజాము స్వామివారు పరమపదవాసల్ వద్ద స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు స్వర్గద్వార ప్రవేశం కల్పించేందుకు భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు.


శ్రీరంగంలో మోహిని అవతారంలో దర్శనమిస్తున్న రంగనాథస్వామి

'ది వర్త్ ట్రస్ట్ స్టోరీ...'

పుస్తకావిష్కరణ

అడయార్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బధిరుల సేవలో 'ది వర్క్‌షాప్ ఫర్ ది రిహాబిలిటేషన్ అండ్ ట్రైనింగ్ ఆఫ్ ది హ్యాండిక్యాప్డ్ (డబ్ల్యూ.ఓ.ఆర్.టీ.హెచ్ - వర్త్) కొనసాగుతుంది. ఈ సంస్థ వజ్రోత్సవ వేడుకలను పురస్కరించుకున 'ది వర్త్ స్టోరీ - ఏ సగా ఆఫ్ ఎనేబ్లింగ్ ది డిఫరెండ్లీ ఏబెల్డ్' అనే పేరుతో రూపొందించిన పుస్తకావిష్కరణ జరిగింది. వర్త్ ట్రస్ట్ మాజీ మేనేజింగ్ డైరెక్టర్ సి.అంటోనీసామి ఆవిష్కరించగా, ప్రముఖ కాలమిస్ట్ శ్రీరామ్ తొలి కాపీ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ హరీష్ లక్ష్మణన్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



'గుడ్ ఈట్స్ క్లబ్' ఆధ్వర్యంలో పొంగల్ వేడుక


వేడుకల్లో ప్రముఖులు

చెన్నై, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): 'గుడ్ ఈట్స్ క్లబ్' ఆధ్వర్యంలో గురువారం పొంగల్ వేడుకలు ఘనంగా జరిగాయి. వేళచ్చేరిలోని ఓ హోటల్లో సామాజిక కార్యకర్త అప్సర రెడ్డి నేతృత్వంలో జరిగిన వేడుకల్లో చెస్ గ్రాండ్ మాస్టర్ విశ్వనాధన్ ఆనంద్ భార్య అరుణ, వారి కుమారుడు అఖిల్ విశ్వనాధన్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అఖిల్ న్యూరోలాజికల్ వైకల్యాలున్న పిల్లలకు సహాయంగా బ్లాక్ ప్రింట్లు, కళాత్మక డిజైన్లతో తన ప్రత్యేకమైన దుస్తులను వేలం వేసి, వచ్చిన మొత్తాన్ని దివ్యాంగ పిల్లల అభివృద్ధికి విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా జరిగాయి.

తిరుత్తణి ఆలయంలో భక్తుల రద్దీ



తిరుత్తణి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. భక్తులు క్యూలైన్లలో వెళ్లి స్వామివారిని దర్శించుకుంటున్నారు. మార్గళి మాసంలో ఈ ఆలయంలో ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా ఉత్సవమూర్తికి అభిషేకాలు, అలంకరణ, దీపారాధన నిర్వహిస్తుంటారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ నిర్వాహకులు వసతులు కల్పించగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు.

13 నుంచి 'చెన్నై సంగమం'

అడయార్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13వ తేదీ నుంచి 'చెన్నై సంగమం' పేరుతో గ్రామీణ కళా సాంస్కృతిక కార్యక్రమం ప్రారంభంకానుంది. ప్రతి యేటా పొంగల్ పండుగ సమయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా డీఎంకే ప్రభుత్వంలో ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహిస్తుంటారు. గ్రామీణ కళలను ప్రోత్సహించేలా, నగర వాసులకు తెలియజెప్పేలా ఈ సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఇందులోభాగంగా ఈ యేడాది ఈ నెల 13న కీల్పాక్కంలోని ఏకాంబరనాథర్ ఆలయ మైదానంలో ముఖ్యమంత్రి స్టాలిన్ 'చెన్నై సంగమం' ప్రారంభిస్తారు. ఆ తర్వాత నగరంలోని పార్కులు, పాఠశాల, కళాశాల క్రీడా ప్రాంగణాలు, బీసెంట్ నగర్, తిరువాన్మియూర్, బీచ్ సహా మొత్తం 18 చోట్ల ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 'నమ్మ ఊరు తిరువిళా' పేరుతో రాష్ట్ర సాంస్కృతి శాఖ నిర్వహించనుండగా, పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.



తిరుమలలో వైకుంఠ శోభ

● నేటి నుంచి పదిరోజుల ఉత్తరద్వార దర్శనాలు ● సుందరంగా ముస్తాబైన శ్రీనివాసుని ఆలయం

తిరుమల, జనవరి9(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల క్షేత్రం ఉత్తరద్వార దర్శనాలకు సిద్ధమైంది. పదిరోజుల పాటు జరిగే వేడుకకు శోభాయమానంగా ముస్తాబైంది. శుక్రవారం నుంచి ఈనెల 19 వరకు వైకుంఠ ద్వారాన్ని తెరిచి దర్శనం కల్పించనున్నారు. ఈక్రమంలో ఆలయాన్ని శోభాయమానం తీర్చిదిద్దారు. ఐదు టన్నుల సంప్రదాయ పుష్పాలతో అలంకరించారు. వైకుంఠద్వారం, బలిపీఠం, ధ్వజస్తంభం వంటి ప్రాంతాలను 1.40 కట్‌ఫ్లవర్స్‌తో అలంకరించారు. ఆలయం వెలుపల ఐదు టన్నుల పుష్పాలను అలంకరణకు వినియోగించారు. వాహన మండపం సమీపంలో 'శ్రీరంగనాథమండపం' సిద్ధం చేశారు. వివిధ రకాల పండ్లు, కూరగాయలు, పుష్పాలతో రంగనాథస్వామి ఆలయ సెట్టింగ్ వేశారు.

తెరుచుకున్న వైకుంఠ ద్వారాలు

గురువారం అర్థరాత్రి శ్రీవారి ఆలయంలోని వైకుంఠద్వారాలు తెరుచుకున్నాయి. 12.05 గంటల సమయంలో తలుపులు తెరిచిన అర్చకులు శుక్రవారం వేకువజాము ధనుర్మాస కైంకర్యాలు నిర్వహించారు. 4.30 వీఐపీ దర్శనాలను కల్పించనున్నారు. టోకెట్లు, టికెట్లు పొందిన భక్తులను గురువారం అర్థరాత్రి12 గంటల నుంచి క్యూకాంప్లెక్స్‌లోకి అనుమతించారు. వీఐపీ బ్రేక్ దర్శనాలు ఉదయం 8 గంటలకు ముగియనున్నాయి. తర్వాత సర్వదర్శనాలను ప్రారంభించనున్నారు.

టోకెన్ ఉన్నవారికే ఎంట్రీ, వసతి

టికెట్లు, టోకెన్లు ఉన్న భక్తులను గురువారం రాత్రి నుంచి కంపార్టుమెంట్లలోకి అనుమతించారు. వారికే గదులను కేటాయించారు. టికెట్లు లేనివారు గదులు లేక షెడ్లు, పార్కులు, కార్యాలయాల ముందు, వసతి సముదాయాల్లో, ఫుట్‌పాత్‌ల పైనే సేదతీరాల్సి వచ్చింది. చలికి వృద్ధులు, చిన్నపిల్లలు ఇబ్బందులు పడ్డారు.

ప్రత్యేకదర్శనాలన్నీ రద్దు

ఈపదిరోజులకు సంబంధించి ఇప్పటికే రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు 1.40 లక్షలు, శ్రీవాణి టికెట్లు 19,500 జారీ చేశారు. తొలిమూడురోజులకు సామాన్య భక్తులకు స్లాటెడ్ సర్వదర్శనానికి సంబంధించి 1.20 లక్షల టోకెన్లను జారీ చేసింది. తర్వాత రోజులకు ఏరోజుకారోజు విష్ణునివాసం, శ్రీనివాసం, భూదేవి కాంప్లెక్స్‌ల ద్వారా జారీ చేయనున్నారు. పదిరోజుల్లో వీఐపీ బ్రేక్‌కు సిఫార్సులు, వృద్ధులు, దివ్యాంగులు, చంటిబిడ్డల తల్లిదండ్రులు వంటి ప్రత్యేకదర్శనాలు ఉండవు. శ్రీవారిమెట్టు మార్గంలోనూ దివ్యదర్శన టోకెన్ జారీ ఉండదు.

వీఐపీలకు చేసిన ఏర్పాట్లు

వీఐపీల పర్యటన నేపథ్యంలో తిరుమలలో 12 వేల వాహనాలకు పార్కింగ్ ప్రదేశాలు సిద్ధం చేశారు. ఎంబీసీ, ఔటర్‌రింగ్‌రోడ్డు, రాంభగీచా, పరకామణి భవనం, అర్చక నిలయం ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాటు చేశారు. వీఐపీలకు దర్శన టికెట్లు, గదుల కేటాయింపు నాలుగు కేంద్రాల్లో జరిగాయి. వెంకటకళ అతిథిగృహంలోని కౌంటర్‌లో గవర్నర్లు, ముఖ్యమంత్రులు, న్యాయమూర్తులు, మంత్రులు, విప్‌లు, స్పీకర్లకు టికెట్లను జారీ చేశారు. సన్నిధానం కౌంటర్‌లో టీటీడీ బోర్డు ఛైర్మన్, బోర్డు సభ్యులు, వారి సిఫార్సులపై టికెట్లు కేటాయించారు. నారాయణగిరి-4 కౌంటర్‌లో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు టికెట్లను జారీ చేశారు. వకుళమాత విశ్రాంతి భవనం కౌంటర్ ద్వారా ఆలిండియా సర్వీస్ అధికారులకు దర్శన టికెట్లు, గదుల కేటాయింపు జరిగింది.



నేడు స్వర్ణరథోత్సవం

శుక్రవారంఉదయం 9 నుంచి 10 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామి స్వర్ణరథంపై కొలువుదీరి మాడవీధుల్లో భక్తులకు దర్శనమిస్తారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు వాహనమండపంలో శ్రీమలయప్పస్వామి దర్శనం ఉంటుందన్నారు. శనివారం ద్వాదశిని పురస్కరించుకుని తెల్లవారుజాము 5.30 గంటలకు సుదర్శన చక్రత్తాళ్వార్ల చక్రస్నాన కార్యక్రమం జరుగుతుంది.



ఘటనపై రెండు కేసులు



మార్చురీలో మృతదేహాలు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆరుగురు భక్తుల మృతిపై డీఎస్పీ వెంకటనారాయణ ఆదేశాలతో సీఐ రామకృష్ణ రెండు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. బుధవారం రాత్రి తిరుపతిలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ఘటనల్లో తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లాకు చెందిన మెట్టూరువాసి ఆర్.మల్లిక.. విష్ణు నివాసం వద్ద దర్శన టోకెన్ల కోసం క్యూలో నిలబడి అక్కడ జరిగిన తొక్కిసలాటలో స్పృహతప్పి పడిపోయిందని బాలాయపల్లి తహసీల్దార్ పి.శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు. ఇది మొదటి కేసుగా పోలీసులు తెలిపారు. మల్లికను రుయాకు తీసుకెళుతుండగా, ఆస్పత్రికి వెళ్లేలోగా మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసిన మేరకు ఆ సమయంలో ఇతర భక్తులు క్యూలైన్ వైపు పరుగెత్తడంతో ఆమె అనారోగ్యం కారణంగా నేలపై పడిందని తెలిపారు. వీరితోపాటు బైరాగిపట్టెడ పార్కు వద్ద మృతి చెందిన ఐదుగురికి సంబంధించి నారాయణవనం తహసీల్దార్ ఎం.జయరాములు ఇచ్చిన ఫిర్యాదుతో మరో కేసు నమోదు చేశారు. విశాఖకు చెందిన కందిపల్లి శాంతి, గుడ్ల రజని, బొడ్డేటి నాయుడు బాబు, సూరిశెట్టి లావణ్య స్వాతి, తమిళనాడుకు చెందిన నిర్మల మృతి చెందినట్లు ఫిర్యాదులో తెలిపారు. రామానాయుడు పార్కు వద్ద దర్శనం టికెట్ల కోసం వేచి ఉండగా క్యూలో ఒక్కసారిగా తోపులాట జరిగి కిందపడ్డారని తహసీల్దార్ ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరిని రుయాకు తరలించగా.. ఈ ఐదుగురు కూడా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ రెండు కేసులపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనలకు బాధ్యులెవరు? ఎలా జరిగింది? ఎందుకు జరిగింది? అనే కోణంలో విచారణ చేస్తున్నారు. బంధువులు, కుటుంబీకుల నుంచి రాతపూర్వకంగా స్టేట్‌మెంట్లు నమోదు చేశారు.

ప్రత్యక్ష సాక్షుల కథనాలు

గోవిందా..గోవిందా అంటూ...

నేను టోకెన్ల కోసం వచ్చి 8.10-8.25గంటలమధ్య ముందువరుసలోనే ఉన్నాను. గోవిందా.. గోవిందా అంటూ నా వెనుకనుంచి బలవంతంగా తోయడంతో కిందపడిపోయాను. దీంతో ఊపిరి ఆడలేదు. ఎలాగో పైకి లేచి నిల్చుని ఊపిరి పీల్చుకున్నాను. తొక్కిసలాట జరిగింది. గేటుకు దూరంగా జరగాలని పోలీసులు మైక్‌సెట్‌లో పలుమార్లు అనౌన్స్ చేశారు. అక్కడున్న వారిలో చాలామంది తెలుగువాళ్లు కాదు. తమిళం, కన్నడ మాట్లాడుతున్నారు. వాళ్లకు అర్థం కాలేదు. కొంతమంది కదిరి, పులివెందుల ప్రాంతాల నుంచి వచ్చినట్టు వాళ్ల యాసను బట్టి అర్థం అయ్యింది. ఒక ఉప్పెనలా ముందుకు రావడంతో అంతా గందరగోళం అయిపోయింది. రెండుగేట్లు ఓపెన్ అయిపోయాయి. పోలీసులు ఎంతప్రయత్నించినా నిలువరించలేకపోయారు. భక్తులు కిందపడిపోయారని పోలీసులు చెబుతున్నా వినకుండా ఫోర్స్‌గా తోసుకుంటూ వచ్చారు.

– సుదర్శన్‌రెడ్డి, కడప



పోలీసులు అరుస్తున్నా..

తిరుపతి రూరల్ మండలం అవిలాల మాది. మధ్యాహ్నం 12.30గంటల సమయంలో అటువైపు వెళ్లాను. పార్క్‌లో చిన్నపిల్లలు, వృద్ధులు, భక్తులు ఎక్కువసంఖ్యలో కనిపించారు. తిరిగిరాత్రి 8.20గంటలప్రాంతంలో ఈమార్గంలో వెళ్తూ అటు చూశాను. వేలాదిమంది టోకెన్లకోసం పార్క్‌లో గుమికూడా ఉన్నారు. ఒకరినొకరు తోసుకుంటూ ఉన్నారు. గేటుకు దూరంగా జరగాలని పోలీసులు మైక్‌సెట్‌లో చెబుతున్నారు. ఈలోపే తొక్కిసలాట జరిగింది.

– లక్ష్మణ్, అవిలాల



అంతా గేటు ముందే!

మధ్యాహ్నం నుంచి భక్తులరాక బాగా పెరిగింది. వచ్చినవారందరూ గేటుముందు భాగంలోకి వచ్చి తోసుకుంటూ ఉన్నారు. వెనుక భాగమంతా ఖాళీగానే ఉంది. పోలీసులు వెనుకకు జరగండని అనౌన్స్‌మెంట్ చేశారు. తీరా గేట్లు తెరచీతెరవముందే భక్తులు దూసుకువచ్చారు. దీంతో తోపులాట జరిగింది. ఘోరం జరిగిపోయింది.

– రాకేష్, స్థానిక దుకాణం వ్యక్తి

స్పెషల్ ఫ్లైట్లతో కిటకిటలాడిన ఎయిర్‌పోర్ట్

రేణిగుంట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరిగిన పెను విషాదం, వైకుంఠ ఏకాదశి పర్వదినం వెరసి వీఐపీల తాకిడితో విమానాశ్రయం గురువారం కిటకిటలాడింది. బాధితులను పరామర్శించడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మాజీ సీఎం జగన్ వేర్వేరుగా తిరుపతి పర్యటనకు వచ్చారు. సీఎం మధ్యాహ్నం 1.20గంటలకు వచ్చి రాత్రి ఎనిమిది గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మధ్యాహ్నం 3.30గంటలకు వచ్చి రాత్రి 8.25గంటలకు బయల్దేరారు. మాజీ సీఎం జగన్ సాయంత్రం 5.30 గంటలకు ఇక్కడకు చేరుకున్నారు. వీరంతా ప్రత్యేక విమానంలో వచ్చారు. మరోవైపు తిరుమలేశుడి వైకుంఠ ద్వార దర్శనం కోసం కేంద్ర విమానాయన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు కూడా విశాఖపట్నం నుంచి ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం 1.30గంటలకు వచ్చారు. తర్వాత తిరుచానూరులో జరిగే ప్రైవేటు కార్యక్రమాలకు వెళ్లారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు ఇండిగో విమానంలో కుటుంబీకులతో కలిసి మధ్యాహ్నం 1.10గంటలకు వచ్చారు. తర్వాత తిరుమలకు బయల్దేరి వెళ్లారు. హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ.. ఇండిగో విమానంలో ఉదయం 10.50గంటలకు వచ్చారు. తిరుపతి, రాజంపేటలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొని, 11వ తేదీన శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణం కానున్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి.. ఇండిగో విమానంలో సాయంత్రం 4 గంటలకు వచ్చారు. తర్వాత రోడ్డు మార్గాన తిరుమలకు బయల్దేరారు. గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి తెల్లవారుజామున 4.55 గంటలకు విమానాశ్రయం చేరుకుని, తిరుమలకు వెళ్లారు. అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తిరుమలేశుడి దర్శనార్థం విశాఖపట్నం నుంచి వచ్చారు. ఇలా వచ్చిన వీఐపీలతోపాటు వారికి స్వాగతం పలకడానికి వచ్చిన వారితో తిరుపతి విమానాశ్రయం కిక్కిసింది. ఇక శుక్రవారంనుంచి వైకుంఠ ద్వార దర్శనం కోసం వివిధ రాష్ట్రాల నుంచి పలువురు ప్రముఖులు రానున్నారు.



టీటీడీ పరిపాలనా భవనంలో మంత్రులు, అధికారులతో సీఎం మీడియా సమావేశం

టీటీడీ చరిత్రలో చీకటి రోజు

ఇటువంటి ఘటన జరగడం చాలా బాధాకరం. టీటీడీ చరిత్రలో ఇది ఒక చీకటి రోజుగా నిలిచిపోతుంది. అధికారుల వైఫల్యమే దీనికి ప్రధాన కారణం. మృతుల కుటుంబీకులకు టీటీడీ, ప్రభుత్వం అండగా నిలుస్తుంది. గాయపడిన ప్రతీ ఒక్కరు కూడా స్వామివారిపై ఉన్న భక్తితో తమకు దర్శన భాగ్యం కల్పించండి అని కోరుతున్నారు. వారి కోరిక మేరకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించి, సురక్షితంగా స్వగ్రామాలకు పంపే ఏర్పాటు చేస్తాం.

– టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి

ఇలాంటి ఘటన దురదృష్టకరం

ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరం. అంచనాలకు మించి భక్తులు అధిక సంఖ్యలో రావడం, వారిని అదుపు చేయలేకపోవడం వల్లే ఈ దుర్ఘటన జరిగింది. ఇందులో ఎవరి నిర్లక్ష్యం ఏమాత్రం ఉందనేది విచారణలో తేలుతుంది. బాధ్యతారహితంగా వ్యవహరించిన వారికి శిక్ష తప్పదు. అలాగే బాధితులకు ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా నిలుస్తుంది.

– టీటీడీ బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి

టీటీడీ వైఫల్యం ఏమీ లేదు

శ్రీవారి భక్తులకు ఈ విధంగా జరగడం చాలా బాధాకరం. వైకుంఠ దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం టీటీడీ అన్ని ఏర్పాట్లు పక్కాగా చేసింది. అయినప్పటికీ ఊహించని రీతిలో భక్తులు రావడం, వారు దూర ప్రాంతాల నుంచి ప్రయాణం చేసి ఉండటం వల్ల సక్రమంగా ఆహారం లేక నీరసించి కిందపడి పోవడంతో తొక్కిసలాట జరిగింది. ఇందులో టీటీడీ వైఫల్యం ఏమీ లేదు.

– కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

సాధారణ భక్తులకు ప్రాధాన్యం లేకనే..

టీటీడీలో వీఐపీలకు తప్ప సాధారణ భక్తులకు ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వడం లేదు. అందువల్లే సాధారణ భక్తుల విషయంలో టీటీడీ, పోలీసుల సమన్వయం లేక ఇటువంటి దురదృష్టకర ఘటన జరిగింది. ఈ ఘటనపై సమగ్ర విచారణ నిర్వహించి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. మృతుల కుటుంబాలను, బాధితులను టీటీడీ, ప్రభుత్వం ఆదుకోవాలి.

– సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

శవ రాజకీయాలు చేస్తే సహించేది లేదు

వైసీపీ నేతలు వారు చేసిన తప్పులను మరిచి జరిగిన దురదృష్టకర ఘటనను అడ్డం పెట్టుకొని శవ రాజకీయాలు చేసేందుకు తెర లేపుతున్నారు. ప్రధానంగా టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి.. టీటీడీని, ప్రభుత్వాన్ని నోటికి వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదు. బాధితులను పరామర్శించి.. అండగా ఉండాలే కానీ, తప్పుడు ప్రచారాలు చేస్తే ఊరుకునేది లేదు.

– తిరుపతి జనసేన ఇన్‌చార్జి కిరణ్‌రాయల్

టీటీడీ, ప్రభుత్వ వైఫల్యమే!

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి

తిరుపతి (జీవకోన), జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఘటనకు టీటీడీ, ప్రభుత్వ వైఫల్యమే కారణమని వైసీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, మాజీ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ నెలరోజులుగా వైకుంఠ ఏకాదశి పేరుతో సమీక్షలు నిర్వహించారే తప్పా ఆచరణలో తగిన ఏర్పాట్లు చేయలేదని విమర్శించారు. టీటీడీలో పనిచేసే వారు తక్కువయ్యారని పర్యవేక్షించేవారు ఎక్కువ అయ్యారని అన్నారు. దర్శనాలకు సంబంధించిన అంశం పూర్తిగా తిరుమల అడిషనల్ ఈవో వెంకన్న చైదరికి సంబంధించిందని ఆయనకు చంద్రబాబు సేవ తప్ప భక్తుల సేవ కనబడటంలేదని విమర్శించారు. ఈ ఘటనలో అడిషన్ ఈవో వెంకన్నచౌదరితో పాటు ఎస్పీ, సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలని, ఈవోను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పూర్తి బాధ్యత వహించాలన్నారు. సనాతన ధర్మాన్ని పరిరక్షిస్తానని చెప్పిన పవనానంద స్వామి దీనిపై మాట్లాడాలంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ సమావేశంలో మేయర్ డాక్టర్ శిరీష, చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మోహిత్‌రెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భూమన కరుణాకర్‌రెడ్డి, పక్కన మేయర్ శిరీష, మోహిత్‌రెడ్డి

వీవీఐపీల రాకతో ఒత్తిడికి గురైన యంత్రాంగం



అధికారులతో చంద్రబాబు

తిరుపతిలో బుధవారం తొక్కిసలాట ఘటన నేపథ్యంలో ఇప్పటికే తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్న జిల్లా యంత్రాంగంపై గురువారం వీవీఐపీల వరుస పర్యటనలు మరింత ఒత్తిడి పెంచాయి. దాంతో అధికారులు సతమతమయ్యారు. బుధవారం తిరుపతిలోని బైరాగిపట్టెడ టోకెన్ల జారీ కేంద్రం వద్ద జరిగిన దుర్ఘటనను తీవ్రంగా పరిగణించిన సీఎం చంద్రబాబు బుధవారం రాత్రే అధికారులపై మండిపడ్డారు. తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందడం దేశవ్యాప్తంగా కలకలం రేపడం, సీఎం చంద్రబాబు సీరియస్ కావడంతో జిల్లా అధికారులు, టీటీడీ అధికారులు ఆందోళనకు గురయ్యారు. పర్యవసానాలు ఎలా వుంటాయోనని వారిలో గుబులు మొదలైంది. అదే సమయంలో గురువారం తిరుపతి వస్తానని సీఎం ప్రకటించడంతో అధికారులను టెన్షన్ చుట్టుముట్టింది. సీఎం ఏమి చూస్తారో, ఏమి అడుగుతారో, ఏం చేస్తారోనని భయాందోళనలకు గురయ్యారు. శుక్రవారం వేకువజామున తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వారాలు తెరవనున్న సంగతి తెలిసిందే. వైకుంఠ ఏకాదశి నాడు శ్రీవారిని దర్శించుకునేందుకు దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో వీవీఐపీలు వస్తుండడంతో వారికి రవాణా, బస, దర్శనాలు ఏర్పాటు చేయడంలో అటు జిల్లా యంత్రాంగం, ఇటు టీటీడీ యంత్రాంగం కూడా తలమునకలవుతున్నాయి. ఆ సమయంలో తొక్కిసలాట ఘటన జరగడం, సీఎం గురువారం పర్యటన తలపెట్టడం అధికారులకు ఊపిరి సలపకుండా చేశాయి. గురువారం ఉదయాన్నే ఏకంగా ఆరుగురు మంత్రులు తిరుపతిలో దిగారు. జిల్లా ఇంచార్జి మంత్రి హోదాలో రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, హోంమంత్రి వంగలపూడి అనిత, వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామా నాయుడు, హసింగ్ మంత్రి కొలుసు పార్థసారథి, దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిలు బృందంగా ఏర్పడి రుయా, స్విమ్స్ ఆస్పత్రులు సందర్శించారు. వారికి కాన్వాయ్‌లు, పోలీసు ఎస్కార్ట్, వెంట అధికారులను నియమించాల్సి వచ్చింది. బస ఇతర ఏర్పాట్లు కూడా చేయాల్సి వచ్చింది. మధ్యాహ్నానికి సీఎం చంద్రబాబు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని అక్కడ నుంచీ తిరుపతి వచ్చారు. సీఎం కోసం కాన్వాయ్, భారీ భద్రత కల్పించారు. వెంట జిల్లా అధికారులు మొత్తం వుండాల్సి వచ్చింది. బైరాగిపట్టెడ టోకెన్ల జారీ కేంద్రం వద్ద బహిరంగంగానే ఆయన కలెక్టర్, టీటీడీ ఈవో, ఎస్పీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిణామం అధికారులను తీవ్ర ఒత్తిడికి లోను చేసింది. సీఎం స్విమ్స్ పద్మావతి ఆస్పత్రికి చేరుకుని బాధితులను పరామర్శించడం, టీటీడీ పరిపాలన భవనం చేరుకుని అధికారులతో సమీక్షించడం చేశారు. సమీక్షలోనూ అధికారుల తీరుపై మండిపడినట్టు సమాచారం. దానికి తగ్గట్టే ఇద్దరు అధికారులపై సస్పెన్షన్ వేటు, మరో ముగ్గురిపై బదిలీ వేటు పడింది. ఈ పరిణామం అధికారులను మరింత ఇరుకున పడేసింది. సీఎం పర్యటన సాగుతుండగానే సమాంతరంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తిరుపతి చేరుకున్నారు. ఆయనకు కాన్వాయ్, భారీ భద్రత, వెంట అధికార యంత్రాంగం వుండాల్సి వచ్చింది. ఆయన కూడా బైరాగిపట్టెడ వెళ్లి అక్కడ నుంచీ స్విమ్స్ వచ్చారు. ప్రజాకర్షణ కలిగిన నేత కావడంతో భారీగా భద్రత కల్పించాల్సి వచ్చింది. ఈ ఇద్దరూ తిరుపతిలో పర్యటిస్తుండగానే ఇంకోవైపు మాజీ సీఎం జగన్ కూడా తిరుపతి వచ్చారు. ఇలా వీవీఐపీలు ఏక కాలంలో తిరుపతి చేరుకుని పర్యటించడంతో అధికార యంత్రాంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంది.

– తిరుపతి, ఆంధ్రజ్యోతి



బైరాగిపట్టెడ పార్క్‌లో పవన్



ఆసుపత్రి వద్ద జగన్

శవ రాజకీయాలు మానుకో భూమనా !

● ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : వైకుంఠ ద్వార దర్శన టికెట్స్ కోసం జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందడం బాధాకరమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. తొక్కిసలాటలో గాయపడి పద్మావతి మెడికల్ కాలేజిలో చికిత్స పొందుతున్న భక్తులను ఆయన గురువారం పరామర్శించారు. మీడియాతో మాట్లాడుతూ భక్తుల మనోభావాలను కించపరిచేలా మాజీ ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి శవ రాజకీయాలు చేయాలని చూస్తున్నారన్నారు. తిరుమల పవిత్రతను దెబ్బతీసిన వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడా ప్రజలు ఇవ్వలేదన్న సంగతి ఆయన గుర్తు పెట్టుకోవాలన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లను విమర్శించే స్థాయి కరుణాకరరెడ్డికి లేదని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలను, గాయపడిన వారిని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు టీడీపీ నేతలు సుగుణమ్మ, నరసింహ యాదవ్, జనసేన నాయకులు కిరణ్ రాయల్, రాజారెడ్డి, బీజేపీ నేతలు భానుప్రకాష్ రెడ్డి, సామంచి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు, నరసింహ యాదవ్

మృతుల కుటుంబాలకు బీసీవైపార్టీ ఆర్థిక సహాయం

పుంగనూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జరిగిన ఘటనలో మృతి చెందిన ఒక్కో కుటుంబానికి రూ.50వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు బీసీవైపార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ తెలిపారు. గురువారం ఆయన తిరుపతి చేరుకుని మృతుల కుటుంబీకులను పరామర్శించారు. ఈ ఘటనకు టీటీడీ చైర్మన్, ఈవో, అధికారులు బాధ్యులన్నారు. వెంటనే బోర్డును రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైసీపీ విధానాలనే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కొనసాగించడం వల్ల ఇలాంటి ఇబ్బందులు వస్తున్నట్లు ఆరోపించారు.



బాధితురాలికి ఆర్థిక సాయం అందజేస్తున్న రామచంద్ర యాదవ్